


కాలింగ్‌బెల్ మోగడంతో పనిమనిషి వచ్చి తలుపు తీసింది. ఎదురుగా మాసినతల, గుబురుగా పెరిగిన గడ్డం, పీక్కుపోయిన ముఖం, మాసిన బట్టలు వీటిఅన్నిటికి స్వంతదారైన ఏభై ఐదేళ్ళ వ్యక్తి నిలబడివున్నాడు. మానసికంగా బాధలలో కృంగివున్న అతను వయసుకు మించిన మరో పదేళ్ళు పైబడినట్లు కనబడుతున్నాడు. "ఎవరు కావాలండీ....?" అడిగింది పనిమనిషి.

"ఇక్కడ ప్రైవేటు మాస్టారు కావాలని తెలిసి వచ్చాను...."

"లోపలకు వచ్చి ఇలా కూర్చోండి.... అమ్మగార్ని పిలుచుకొస్తాను...." పనిమనిషి దారి తొలగడంతో అతను లోనికొచ్చి సోఫాలో కూర్చున్నాడు. సీలింగ్ ఫేన్ ఆన్‌చేసి వెళ్ళింది పనిమనిషి.

# రాజీ

శ్రీమతి సుశీలారామం




చుట్టూ పరికించి చూశాడతను. డ్రాయింగు రూమంతా నీటుగా కడిగిన ముత్యంలావుంది. ఏస్థానంలో వుండాల్సిన వస్తువులు ఆస్థానంలో పొందిగ్గా వున్నాయి. ఆ ఇంటి ఇల్లాలి ఓర్పుకి నేర్పుకి ఎంతో మెచ్చుకున్నాడతను. ఇంతలో లోపల్నుండి డోర్ కర్టెన్ తొలగించుకుని మధ్య వయుస్కురాలొకామె వచ్చింది. వస్తూనే అతనికి నమస్కరించి ఎదురుగా కూర్చుంది. ప్రతి నమస్కారం చేస్తూ ఆమెను పరీక్షగా చూశాడతను. అందంగా ఆరోగ్యంగా వుందామె. భుజాల నిండుగా పైటకప్పుకుని హుందాగా వుంది. అనుకోకుండా అతని చూపు, ఆమె కుడివైపు మెడమీద వున్న చింతపిక్కంత, తేనె రంగులో వున్న పుట్టుమచ్చమీద పడింది. క్షణకాలం తత్తరపడ్డాడతను.

ఆమె.... ఈమె అయివుండదని సమాధానపడదామనుకున్నాడు. కాని లోన మనసు అతని చెప్పుచేతల్లో వుండటంలేదు. సందేహనివృత్తి కొరకు ఆమెను అడిగాడు. మీరు, మీరు రాజేశ్వరికదూ—" ఈ సారి ఆశ్చర్యపడటం ఆమె వంతయింది.

"అరె! మీకు నాపేరు ఎలా తెలుసు? ఇంతవరకు మిమ్మల్నెప్పుడూ చూళ్ళేదు కూడాను...." ఆమె సమాధానంతో అతను మరింత వులిక్కిపడ్డాడు. ఔను మరి ఇరవై ఏళ్ళక్రితం సంవత్సరంపాటు అతనితో కాపురంచేసిన ఆమె, అతన్నెప్పుడూ చూళ్ళేదంటుంటే.... వులిక్కిపడడూ? కాని, అది ఆమె పొరబాటుకాదు. అతని రూపురేఖలలా మారిపోయినయ్. నా అన్నవాళ్ళవల్ల, వాళ్ళు సృష్టించిన పరిస్థితులవల్ల అతనలా మారు రూపు పడిపోయాడు. జీవన సమరంలో అతను చావుదెబ్బ తిన్నాడు. కఠిన పరిస్థితులు అతన్ని వెన్నంటి తరిమి తరిమి కొడుతున్నాయి.

"నేను రాజేశ్వరీ....పి. డి. రాజారావును. ఇరవై ఏళ్ళ క్రితం నీదగ్గర విడాకులు తీసుకున్న రాజారావును. ఆ దౌర్భాగ్యుణ్ని నేనే" హీనస్వరంతో చెప్పాడతను. వింటున్న ఆమెకు మతిపోయినట్లయింది.

"ఆశ్చర్యపడుతున్నావ్ కదూ! నాకీ శిక్ష కావలసిందే, రాజేశ్వరీ! చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత అవి నా పరిస్థితికి నేనే కారణభూతుడ్ని."

తేరుకున్న రాజేశ్వరి అడిగింది "అదేం అలా అంటున్నారు? మీకు పెళ్ళయిందని, నలుగురు పిల్లలని విన్నాను" సందిగ్ధంగా అంది.

"ఔను. నాకు పెళ్ళయింది. నలుగురు పిల్లలు పుట్టారు. పున్నామ నరకంనుండి కాపాడుతాడనుకున్న పెద్ద కొడుకుని వున్నదంతా అమ్మి పెద్ద చదువులు చదివిస్తే, వాడి దారి వాడు చూసుకుని నన్ను ఈ భూలోక నరకంలో వదిలేసి వెళ్ళిపోయాడు. చేతికంది వచ్చిన సుపుత్రుడు, కుటుంబ భారాన్ని తన భుజస్కంధాలమీద వేసుకుని నాకు విశ్రాంతినిస్తాడనుకున్నాను గాని. వాడి స్వార్థం వాడు చూసుకుంటాడని కల్లో గూడా అనుకోలేదు. తరువాత పిల్ల. నేను దాన్ని ఒకింటిదాన్ని చేస్తానని నమ్మకం లేకనేమో, ఎవడితోనో లేచిపోయింది. ఆ తరువాత వాడు వట్టి రౌడీ. చదువు ఈషణ్మాత్రం అబ్బలేదుగాని, ఇంట్లో తల్లిదండ్రులను దబాయించి, వాళ్ళ బుర్ర పగలగొట్టయినాసరే వాడి వ్యసనాలకు పైకం పట్టుకుపోవటం బాగా అబ్బింది. ఇంక ఆఖరి పిల్ల. ఎవడు దొరుకుతాడా, అక్కగారిలా లేచిపోవడానికని చూస్తుంది. ఇహ నా ఇంటి ఇల్లాలంటావా చావూ

బ్రతుకూ గాకుండా మంచాన్నంటి పెట్టుకునే దీర్ఘ రోగి ఐపోయింది. ఆ పరిస్థితిలో కూడా అసమర్థ తనూ, చాతకాని తనాన్ని పదే పదే ఎత్తి పొడుస్తుంటుంది. తన ఖర్మ కాలి కట్టుకున్నానంటుంది. రాజేశ్వరీ! చూశావా నా పరిస్థితి. ఆ నాడు నువ్వు అన్న మాటలన్నీ అక్షరాలా జరిగినయ్. కడుపున పుట్టిన పిల్లలయితే కన్నవాళ్ళను నెత్తిన పెట్టుకుంటారనుకున్నాను. ఎంత చేసినా పరాయివాళ్ళే నను కున్నాను. కాని నా పిల్లల్లాంటి దౌర్భాగ్యులు ఈ ప్రపంచంలో ఎవరికీ పుట్టకూడదని ప్రార్థిస్తున్నాను. పిల్లలు లేకుంటే ఒకటే బాధ. కాని వాళ్ళు పుట్టి, ఎందుకూ కొరగాని వాళ్ళైపోతే అంతకు మించిన నరకం మరోటుండదు రాజేశ్వరీ!" మాట్లాడుతూన్న అతని గొంతు బొంగురు పోవటంతో మాటలు ఆపేశాడు. కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి.

ఇంతట్లో స్కూటరొచ్చి ఇంటి ముందు ఆగింది. తెల్లగా పొడుగ్గా అందంగా వున్న ఓ యువకుడు మెడలో స్టెతస్కోప్‌తో వచ్చాడు లోనికి. వస్తూనే అక్కడ కూర్చున్న రాజేశ్వరి కాళ్ళకు ఒంగి దణ్ణం పెట్టాడు. "ఆంటీ! ఈ రోజు నేను మొదటగా చేసిన ఆపరేషన్ సక్సెస్ అయింది. ఇదంతా నీచలవే! నన్ను దీవించు ఆంటీ!" అన్నాడు. అతన్ని లేవనెత్తి పక్కన కూర్చోబెట్టుకుంది ఆమె. ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

"వీడు ఎవరనుకుంటున్నారు? మా నానీ మొన్ననే ఈ వూళ్ళో ప్రాక్టీసు పెట్టాడు. మా మున్నీ కూడా డాక్టరే! దాని భర్తా డాక్టరే. ఆ దంపతులిద్దరూ మొన్ననే స్టేట్స్‌కెళ్ళారు. పిల్లలిద్దరూ నా ప్రాణం—వాళ్ళ ప్రాణం నేను. నన్ను కాలు కింద పెట్టనివ్వరు. ఏజన్మలోనో చేసుకున్న పుణ్య ఫలం ఈ జన్మలో అనుభవిస్తున్నాను నేను. ఆఁ చెప్పడం మర్చిపోయాను. సెకెండ్ క్లాసు చదువుతున్న నాని కొడుక్కి మీరు ప్రైవేటు చెప్పాలి. బాబూ నానీ! ఈయన...." ఆ తరువాత మరేం వినలేకపోయాడతను ఆమె ఎంత పిలుస్తున్నా వినిపించుకోకుండా గబగబా వెళ్ళిపోయాడు. బైట ఎవరో పిలవడంతో లేచి వెళ్ళాడు నాని. ముసలాయన వెళ్ళినవైపే చూస్తున్న ఆమెను ఇరవై సంవత్సరాల గతం చుట్టుముట్టింది.

రాజేశ్వరి, ఇందిర ఒకే ఊళ్ళో

పుట్టారు. పక్క పక్క ఇండ్లల్లో పెరగకపోయినా, ఒకే మంచంలో పడుకుని, ఒకే కంచంలో తినక పోయినా, ఒకే ఎలిమెంటరీ స్కూల్లో చదువుకుని, ఆ పైన హైస్కూల్లో చదువుకున్నారు. టెన్త్ క్లాస్ అవగానే ఇందిరకు ఇంక చదువు చెప్పించే స్తోమతు లేక, సూపర్‌వైజర్ చేస్తున్న, మేనత్త కొడుకయిన రాజుకిచ్చి వివాహం జరిపించాడు ఆమె తండ్రి. రాజేశ్వరి డిగ్రీ పూర్తిచేసి ఓ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. తల్లిదండ్రు లెంత బ్రతిమాలినా, తనకు నచ్చిన వాడ్ని తనే స్వయంగా సెలక్టు చేసుకున్నాకనే, పెళ్ళి చేసుకుంటా నని, అంతవరకు పెళ్ళి ప్రస్తావన తేవద్దనీ ఖచ్చితంగా చేప్పేసింది.

స్నేహితురాళ్ళిద్దరికీ ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమ, అభి మానం. శలవులీయగానే, స్నేహితురాలెంత దూరాన వున్నా సరే, మొదటగా ఆమెని చూశాకనే తల్లిదండ్రుల దగ్గరి కెళుతుంది రాజీ. మాల కూడు తినొచ్చా వంటూ తల్లి నానా రకాలుగా ఆచారం పేరిట కూతుర్ని స్నానాలు జపాలు శుద్ధులు అంటూ విసిగిం చేది. అలాగైతే ఆ ఇంట్లో కాలు పెట్టనని రాజీ బెదిరించాక, ఆమె తల్లిదండ్రులే ఆమెతో రాజీపడి వుండేవారు. ఇందిర భర్త కూడా చాలా మంచి మనిషి కావడం వల్లను, రాజీని తన తోడబుట్టిన దానిలా చూసుకోవడం వల్లను, వారి స్నేహం, చెక్కు చెదరలేదు. రాజేశ్వరి రాకపోకలకు అంత రాయమూ కలగలేదు.

ఎప్పటిలాగానే సమ్మర్ హాలీ డేస్‌కి వస్తున్నట్లు స్నేహితురాలికి వుత్తరం వ్రాసింది రాజీ. అది చదువుకోగానే ఇందిర మనసు ఆనందంతో గంతులు వేసింది. మనసుకే గాదు, శరీరానికూడా డాన్సు చెయ్యాలన్నంత టెన్షన్‌గా వుంది. ఆ ఆనందంలో పాలు పంచుకోటానికి ఇంకా శ్రీవారు ఆఫీసునుండి, పిల్లలు కాన్వెంట్ నుండిరాలేదు. కాలుగాలిన పిల్లిలా గదిలో అటు నిటు తాచ్చాడింది ఇందిర.

ఆ రోజు రాజీ వచ్చేరోజు. ఇందిర భర్త రాజు స్టేషన్‌కెళ్ళాడు. అతడటు వెళ్ళిన దగ్గర్నుండీ పిల్లలు, ఇందిర వీధి అరుగు మీదనే మకాం పెట్టేశారు. క్షణ మొక యుగంలా గడుస్తూంది వాళ్ళకు. అనుకున్న టైము కంటే ఓ జీవితకాలం లేటుగా వచ్చే

రైళ్ళను, బహిరంగంగానే దుమ్మెత్తి పోసేస్తుంది ఇందిర. ప్రయాణం చేసి వచ్చేవాళ్ళ కంటే వాళ్ళ గురించి ఎదురు చూసేవాళ్ళకే ఎక్కడ లేని ఆత్రుత, విసుగు, కోపం.

ఇందిర, పిల్లలు ఓ రెండు గంటలు తపస్సు చెయ్యగా, వీధి చివర రిక్షా కన్పించింది. పిల్లలు కేరింతలు కొడుతూ రిక్షాకెదు రెళ్ళారు. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తూంది ఇందిర. రిక్షా ఆపి ఎదురొచ్చిన పిల్లల్ని కూడా ఎక్కించుకున్నాడు రాజు, రిక్షా అంత దూరంలో వుండగానే హతాసురాలై పోయింది ఇందిర. రాజు, పిల్లలు మాత్రమే వున్నారు అందులో. నీరసంగా అరుగుమీదే కూలబడిపోయింది. రిక్షా వాడికి డబ్బులిచ్చేసి, లోనికొస్తూ ఏదో చెప్పబోయాడు రాజు. "మీరేం చెప్పనక్కర్లేదు...." విసురుగా లోని కెళ్ళిపోయింది ఇందిర.

ఉక్రోషంతో మంచం మీద పడిపోయి తలగడలో తల దూర్చే సింది. "అదేమిటోయ్ ఇందూ.... మరీ చిన్న పిల్లలా తయా రయ్యావ్" మంచం మీద కూర్చుని భార్యని తన వైపుకి తిప్పుకో బోయాడు రాజు. భర్త చేతిని విసిరి కొట్టింది ఇందిర. "ఇది మరీ బావుంది. అత్త మీది కోపం దుత్తమీద చూపించినట్లు మధ్య నేనేం చేశాను. ఆ కోపం నామీద చూపిస్తున్నావ్. వచ్చిన ట్రైన్ వెళ్ళి పోయేవరకూ ఆగి మరీ వచ్చాను. ఆవిడగారు రాకపోతే నాదా పొరపాటు...అరె...రాజీ కలా నిజమా?...." భర్తమాటలకు తక్కున లేచి ఇటు తిరిగింది ఇందిర. పక పక నవ్వుతూ రెండు చేతులతోటీ చుట్టేశాడు భార్యని.

పది నిముషాలపాటు వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు ఆ భార్యా భర్తలు. తలుపు మీద టక టక మని శబ్దం గావటంతో, వులిక్కి పడి, ఇటు చూసిన వాళ్ళిద్దరూ షష్ట్ ఐపోయారు. అంతలోనే తేరుకుని చటుక్కున దూరంగా జరిగిపోయారు. ఇందిర ఒక్క వుదుటున లేచి వచ్చి స్నేహితు రాల్ని చుట్టేసుకుంది. "అదేమి టమ్మా రాజీ! నీకేమైనా మాయా మంత్రాలు తెలుసా? నేను స్టేషన్‌కి వస్తే నీవు బండి దిగలేదు. ఈ టైముకి బస్సులు కూడా లేవు. మరి ఎలా వచ్చావిప్పుడు" రాజు అడిగాడు.

"ఎగిరొచ్చా నండీ రాజూ భయ్యా! తమరు స్టేషన్‌కొచ్చిందీ

లేనిదీ ఇక్కడికొచ్చి చూస్తే తెలుస్తూనే వుంది" రాజీ మాటలకు అడ్డొచ్చింది ఇందిర. "అన్యాయంగా మాట్లాడకే రాజీ! విన్ననలు ఏం చేస్తే పాపం వుందే? బండి టైముకి గంట ముందుగానే మీ భయ్యా స్టేషన్‌లో పడిగాపులు పడి కూర్చుంటే రాలేదని అపవాదు లేస్తున్నావా?"

"అమ్మా, ఇందిరమ్మ తల్లీ! నీ శ్రీవారు స్టేషన్‌కి రావడం చూశానమ్మా! కాని అప్పటికప్పుడే నాకో ఐడియా తట్టి, వెంటనే అమలులో పెట్టేశాను. నేను ట్రైన్ దిగుతూనే అల్లంత దూరంలో జనాన్ని తప్పించుకుంటూ వస్తున్న మీ ఆయనగార్ని చూసి, చాటుగా మరో పక్కకు తప్పుకున్నాను. నా సోదరులుంగారు వెదికి వెదికి వెళ్ళిపోయేవరకూ చూసి, స్టేషన్ వదిలాక, నేను రిక్షా కట్టించుకుని బయల్దేరాను. కావాలనే రిక్షావాడ్ని నాల్గు వీధులూ తిప్పించి, వాడికో రెండు రూపాయి లెక్కువిచ్చి, ఇప్పుడే ఇక్కడ దిగాను. ఇంట్లోకి రాగానే టిక్కెట్టు లేని సినిమా చూపించేశారు మీ ఆయనా, నువ్వు" రాజీ మాటలకు సిగ్గు పడ్డారు ఇందిర, రాజు.

"సరేలే మహా ఘనకార్యం చేశావ్‌గాని, ఇట్లాంటి పిచ్చి పను లెప్పుడూ చెయ్యకు. మే మెంత డిజప్పాయింట్ అయిపోయామో నీకేం తెలుసు? ఇంక పద— ప్రొద్దుట ఎప్పుడు మింగావో, నీ కిష్టమైనవన్నీ చేశాను. త్వరగా స్నానం చేసి వస్తే అందరం కలిసి తిందాము" ఇందిర మాటలతో ఆకలి గుర్తుకొచ్చి అక్కడ్నుండి గబగబ కదల బోయింది. "ఆంటీ...." అంటూ పిల్లలిద్దరూ చేతులందివ్వటంతో, వాళ్ళిద్దర్నీ ఎత్తుకుని లోనికి తీసు కెళ్ళింది రాజీ.

* * *

"అప్పుడే రాజీ వచ్చి నాలుగు రోజులైనా నాలుగు క్షణాల్లా గడిచిపోయినయ్ రోజులు. పాపం! అదక్కడ కాలేజీలో చాకిరీ చేసి చేసి వస్తుందా. ఇక్కడికొచ్చి నాల్గు రోజులు విశ్రాంతిగా వుంటుందంటే, ఈ మాయదారి జ్వరం ఇప్పుడే రావాలా నాకు. ప్రొద్దుట్నుండీ ఆ వంటింట్లో నానా బాధలూ పడుతూంది. నేను లేచి వెళ్ళబోతే ఆ ఛాయలకే రానివ్వ డంలేదు. మీరైనా వెళ్ళి దానికి కాస్త సాయపడండి!" భర్తతో అన్నది ఇందిర.

"ఏమండోయ్, శ్రీమతిగారూ!

పీ స్నేహితురాలిమీద నీకున్న అభి మానానికి జోహార్లుగాని, వంటింట్లో ఆ సహాయ కార్యక్రమాలు అవీ నేను చెయ్యలేను. హోటల్‌నుండి కేరియర్ తెస్తానంటే, ఆ వంట లక్కా వూరుకోటం లేదు. పోనీలే పంతులమ్మగారి ప్రావీణ్యం పాఠాలు చెప్పటం వరకేనా, పాక శాస్త్రంలో కూడా వుందా నేను సర్టిఫై చేస్తాను లేవోయ్!" అక్కడే డ్రెస్సింగు టేబుల్ దగ్గర కూర్చుని షేప్ చేసుకుంటున్న రాజు, భార్యని వేళాకోళమాడాడు.

వారం రోజులైనా ఇందిర జ్వరం తగ్గుముఖం పట్టలేదు. డాక్టర్ టైఫాయిడ్ అన్నారు. మందులెంత జాగ్రత్తగా వాడు తున్నా, మనిషి బాగా నీరసించి పోయింది. రాజు ఆఫీసుకు శలవు పెట్టి భార్యదగ్గరే వుంటున్నాడు. రాజీ ఇంట్లోపని, పిల్లలు బాగా చిన్నవాళ్ళవటంతో వాళ్ళని చూసు కునేసరికే నానా యాతన పడిపో తుంది. రాజీ బాధ చూడలేక బల వంతంగా హోటల్‌నుండి కేరియర్ తెస్తున్నాడు రాజు. రెండువారా లయ్యేసరికి జ్వరం తగ్గుముఖం పట్టినట్లే పట్టి మళ్ళీ తిరగబెట్టింది. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ మూలంగా ఇంక శలవు పెట్టటానికి వీలుగాక, రోజూ ఆఫీసుకెళ్ళి వస్తున్నాడు రాజు.

ఆ రోజు రాత్రి పదిగంటలైనా రాజు ఇంకా ఇంటికి రాలేదు. మందులమూలంగా మగతగా, పడు కుంది ఇందిర. ఇందిర మంచా నికి దగ్గరగా కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటుంది రాజీ. రాజీ వచ్చిన దగ్గర్నుండీ పిల్లలు పక్కగదిలో రాజీ దగ్గరే పడుకుం టున్నారు. గోడ గడియారం చప్పుడు తప్పించి ఇల్లంతా నిశ్శ బ్దంగా వుంది. రాజీకి నిద్ర ముంచు కొస్తూంది. భోజనం డైనింగ్ టేబుల్ మీదవున్నా, నిద్రపట్టేస్తే రాజు వచ్చినప్పుడు లేచి వెళ్ళి, తలుపు తీయటం కష్టమని అలాగే కూర్చుని వుంది. పుస్తకం మడిచి పక్కన పెట్టేసింది. స్నేహితు రాల్ని చూసేసరికి రాజీకి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. పదిహేను రోజుల జ్వరం ఇందిరను పీల్చి పిప్పిచేసి వదిలిపెట్టింది. మనిషి గుర్తు పట్టలేనంతగా చిక్కిపో యింది. ఇంకా పథ్యం పెట్టలేదు. మనిషి కోలుకుని లేచి తిరిగేసరికి ఇంకెన్ని రోజులు పడుతుందో. రాజీకి శలవులు అయిపోవస్తు న్నాయి. కాని, ఇందిరను ఆ స్థితిలో వదిలిపో బుద్ధిగాక మరో

పదిరోజులు లీవు పెట్టటానికే విశ్చ యించుకుంది. అలాగే ఈశెలవుల్లో ఇంటికి రావటానికి కుదరదంటూ ఆ రోజే వుత్తరం వ్రాసింది. ఆ వుత్తరం చూసుకుని తల్లిదండ్రులు కదంతొక్కుతారని రాజీకి బాగా తెలుసు. రాజీ తల్లిదండ్రులకు బాగా కులాలపట్టింపులు వుండటం వల్ల ఇందిరతో స్నేహానికి ఎన్నో ఆంక్షలు పెట్టారు. కాని, తన మన సుకు నచ్చింది తప్ప ఎవ్వరిమాటా లెక్కచెయ్యని కూతుర్ని దూరం చేసుకోలేక మింగాలేక, కక్కాలేక వుంటున్నారు.

వీధి తలుపు శబ్దంగావటంతో లేచి వెళ్ళి తలుపు తీసింది రాజీ. రాజు గుమ్మందాటి ఒకడుగు లోపికి వెయ్యగానే గుప్పున వాసన కొట్టింది. ముక్కు మూసుకుంటూ ఆశ్చర్యంగా నోరువెళ్ళబెట్టి నాలు గడుగులు వెనక్కి వేసింది. తడ బడ్డాడు రాజు. "సారీ....రాజీ... నా ఫ్రెండొకడు పార్టీ ఇచ్చాడు. వాళ్ళంతా బలవంతం చేస్తేనూ తప్పనిసరై వసిగాడు సర్లే.... సర్లే....పదండి భోజనంచేద్దురు గాని...." వీధి తలుపు గడియపెట్టి వంటింట్లోకి దారితీపింది రాజీ.

"అబ్బే.... నా కాకలిలేదు కొంచెం పాలుంటే తెచ్చిపెట్టు" తన గదిలోకెళ్ళిపోయాడు రాజు. రాజీ పాలు వెచ్చచేసి తీసుకొచ్చింది. అప్పటికి రాజు బట్టలు మార్చుకుని, కుర్చీలో కూర్చున్నాడు. పాలగ్లాసు అతని చేతికిచ్చి, నిద్రవస్తుందంటూ వెళ్ళిపోయింది రాజీ. ఆమె రాసు కున్న పౌడరు వాసన, తలలోవున్న సంపెంగవాసన కలిపి మత్తుగా గమ్మత్తుగా అనిపించింది రాజుకు. వెళ్ళిపోతున్న ఆమె వైపు రెప్ప వెయ్యకుండా చూస్తుండిపోయాడు. ఏనాడూ కనిపించని కొత్తదనం ఆమెలో చూశాడతను. పక్కనే మంచంలో పడుకున్న భార్యని చూశాడు. వుసూరుమంటూ విట్టూరు స్తూ పాలు గడగడతాగేసి నిద్ర రాక లేచి హాల్లోకొచ్చి, సిగరెట్ వెలిగించుకుని పుస్తకం తీసాడు.

ఓ అరగంట గడిచేసరికి విసు గొచ్చి పుస్తకం అక్కడ పడేసి, లేచి గదిలోకెళ్ళబోతూ, అప్రయ త్నంగా పక్క గదివైపు చూశాడు. తలుపు ఓరగా తీసివుంది. మనిషికి మందు నిషా బాగా తలకెక్కి వుండటం మూలాన్ని మనసు అతని చెప్పుచేతల్లో లేకుండా పోయింది. తడబడుతూనే గది దగ్గరకొచ్చి ఆగాడు. పిల్లలిద్దరు చెరొక మంచంమీద, రాజీ ఒక మంచంమీద ఆదమరచి నిద్ర

పోతున్నారు. రాజీ అస్తవ్యస్తంగా పడుకునుంది. పమిట స్థానభ్రంశమైంది. చీర కొనలు మోకాలువరకు తొలిగిపోయినయ్. రాజు శరీరం వేడెక్కి పోతుంది. కోరికలు గుర్రాల్లా దౌడుతీస్తున్నాయి. మనసు ఏక్కడో ఓమూల కూడదని చిన్నగా చెబుతున్నా...కాళ్ళు అతని మాట వినడంలేదు. అక్కడ్నుండి కదలడంలేదు. పదినిముషాలపాటు అక్కడే నిలబడి చూస్తున్న అతని మనసు వశం తప్పింది. యుక్తాయుక్త జ్ఞానం కోల్పోయిన అతని కళ్ళకు, కామం అనే పొరలుకప్పి, ఆమె తన తోబుట్టువులాంటిదని గాని....ఆమె జీవితంలో నిప్పులు పోస్తున్నాననిగాని ఆలోచనరా లేదు. నిండు యవ్వనంలో వున్న ఒక ఆడది మాత్రమే అక్కడ కనిపిస్తూంది అతనికి.

మెల్లగా తలుపు తోసుకుంటూ లోనికెళ్ళాడు. రాజీ మంచం దగ్గరగావచ్చి, ఆమె పక్కన చోటు చేసుకుని కూర్చుని, ఆమె అందాలన్నీ కళ్ళతో తాగేసేలా చూస్తూ మీదికి వొంగబోయాడు. ఇంతలో మెలకువ వచ్చిన రాజీ కళ్ళు తెరిచి చూసింది. అది కలో, నిజమో తెలియక కొంత సేపటివరకూ అయోమయంగా చూస్తూంది పోయింది. రాజు కళ్ళు చింత నిప్పులా వున్నాయి. ఆ కళ్ళు కామంతో మూసుకుపోయ వున్నాయి. మనిషి దగ్గర్నుండి విస్కీ వాసన భరింపరానంతగా వస్తూంది.

రాజీ భయంతో బిగిసిపోయింది. భుజాలు నొక్కిపట్టి మీదికి వంగబోతున్న రాజును జుట్టుపట్టుకుని వెనక్కి నెట్టింది. ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. కాని, అతడు తిరిగి ఆమెను పట్టుకున్నాడు. "రాజీ ప్లీజ్! నన్నర్థం చేసుకో! ఒక్కసారి. నీకేం భయం లేదు. ఇప్పుడు నువ్వు కాదంటే నేను చచ్చిపోవాల్సి వస్తుంది రాజీ" అతని మాటలకు ఆమెకు రోత పుట్టింది. ఆమెను కాటేయటానికి పడగవిప్పి బుసలు కొడుతున్న త్రాచుపాములా ఉన్నాడు అతను. కళ్ళల్లో నిప్పులు రాలుస్తూ చూసింది అతన్ని.

చాచిపెట్టి ఒక్క లెంపకాయ కొట్టింది. కాని అతనిలో మార్పేమీ రాలేదు. పట్టు విడువలేదు. అంతకంతకు ఆమె భయంతో స్పృహ తప్పుతుందేమో అన్నంత బేలగా వుంది. జ్వరంతో మంచంలో పడి ఉన్న స్నేహితురాలికిదంతా తెలిస్తే ఏమైపోతోందన్న భయంతో అతనికే మంచిగా చెప్పి మార్చుదామని ఎంతగానో బ్రతిమలాడింది.

"రాజూ భయ్యా! ఈ రోజెందు కిలాగై పోయావు? విన్నేమైనా ఆవ హించిందా? ఇదంతా ఇందూ చూసిందంటే అది మనకు దక్కదు. నా జీవితం నాశనంచేస్తే నీకేం వస్తుంది? నీ భార్య ఒక్క పదిహేను రోజులు మంచంలో వున్నంతలో నీవింత దిగజారిపో తావా?నువ్వింత అల్పుడివా? భయ్యా! ఇప్పటికయినా జరిగిందంతా మని దరిలోనే వుంటుంది. ఇందూకి తెలియనీయవద్దు. నన్నొదులు ప్లీజ్" చేతులెత్తి దండం పెట్టింది.

లేడి కన్నీళ్ళకి వేటగాడు కరుగు తాడా? అతడి ధ్యేయమంతా ఆ లేడిని చేజిక్కించుకోవటమే. మానవజాతి పుట్టింది మొదలు ఈ నాటివరకు శారీరకంగా మగవాడి కంటే బలహీనురాలైన ఆడది ప్రతిఘటించలేకపోతుంది.

అతని పశుబలంముందు ఆమె ఎందుకూ పనికి రానిదై పోయింది. ఇంక ఆఖరి ప్రయత్నంగా రాజీ రెండు కాళ్ళూ ఎత్తి అతన్ని పొట్టలో తన్నింది. అతని పట్టు సడలటంతో వెంటనే లేచి ఒక్క పరుగున హాల్లోకొచ్చి పడింది. కాని, మెరుపుకంటే వేగంగా అతనూ ఆమె వెనకే వచ్చి పట్టుకున్నాడు.

"ఇందూ!...." గట్టిగా అరిచింది రాజీ. తన నోటితో ఆమె నోరు మూసాపేడు రాజు. అక్కడే నేల మీద పడేసి ఆమెను ఆక్రమించు కోబోతున్నాడు. ఆమె గింజుకోవ టం, ఆమె మొండితనం అతన్ని మరీ రెచ్చగొట్టి విచక్షణాజ్ఞానం కోల్పోయిన రాక్షసుడిలా మారి పోయాడు.

ఆ పెనుగులాటలో ఆమె తుఫా నులో చిక్కుకున్న చిగురాకులా రెపరెపలాడి పోతూంది ఆమె. ఇంతలో ఎలా వచ్చిందో, ఏ శక్తి ఆమెనక్కడికి తీసుకురాగలి గిందో అక్కడికొచ్చింది ఇందిర.

క్షణంలో అంతా అర్థమయింది ఆమెకు. కోపావేశాలతో అపర కాళిలా మారిపోయింది ఆ క్షణంలో చుట్టూ చూసింది. పక్కనే కుట్టు మిషన్ మీద బట్టలు కత్తిరించుకునే కత్తెర కనిపించింది. మరో ఆలో చన లేకుండా ఆ కత్తెర తీసు కుంది చేతుల్లోకి మంత్రించినట్లుగా నడిచివెళ్ళి, భర్త వెన్నులో కసి తీరా ఒకేసారి పొడిచింది....

అంతే! చెవులు పగిలిపోయేలా గావు కేక పెడుతూ నేలకొరిగి పోయాడు రాజు. రక్తం ఇందిర ముఖాన చిమ్మింది. అప్పుడు చూసింది రాజీ ఇందిరను.

"ఇందూ!" కంగారుగా లేచింది.

విషయమంతా అర్థం చేసుకుంది. ఒకర్నొకరు పట్టుకొని బావురుమన్నారు. ఇందిర స్పృహ తప్పి పడిపోయింది. అలా పడిన మనిషి ప్రాణాలతో తిరిగి లేవలేదు.

తర్వాత తతంగమంతా మామూలుగానే జరిగిపోయింది. తన మూలంగా కన్నవాళ్ళను శాశ్వతంగా పోగొట్టుకున్న పసివాళ్ళను తన కన్నబిడ్డల్లా పెంచి పెద్ద చెయ్యడానికే నిశ్చయించుకుంది రాజీ. ఇంక తన జీవితంలో ఎవ్వరికీ చోటివ్వ కూడదనుకుంది.

"కాని..., కాని జరిగిందేమిటి" గతంనుండి వర్తమానంలోకి వచ్చిన రాజీ, ఆ భయంకరమయిన జ్ఞాపకాలతో ఒళ్ళంతా చెమటలు పట్టేసి గజగజలాడిపోతూంది. నీరసంగా లేచి వెళ్ళి మంచం మీద వాలిపోయింది.

ఇంటి ముందు రిక్షా ఆగిన శబ్దం గావటంతో తలుపు తీసుకుని ఇవతలకొచ్చింది శేషమ్మగారు. రిక్షా దిగి నెమ్మదిగా నీరసంగా వస్తున్న కోడల్ని చూసి ఆశ్చర్యపోయిందావిడ. "అదేమిటే! ఎక్కడ్నుండి వస్తున్నావ్? కాలేజీకి వెళ్ళలేదా? అలా వున్నావేమిటి? ఏం జరిగిందసలు? అంత నీరసంగా వున్నావు?"

"అబ్బబ్బ! నాకే రోగం రాలేదుగాని, నన్నట్టే విసిగించకండి...." అత్తగార్ని విసుక్కుంటూనే తన గదిలోకెళ్ళి మంచం మీద వాలిపోయింది. రాజీకి మతిపోయినట్లుగా వుంది. తల పగిలిపోతూంది. "ఏమిటి ఇలా జరిగిందేవిటి? ఇంత మోసం చేస్తాడా! ఎంత వంచకుడు? తనే తెలివి తక్కువగా అతని వుచ్చులో పడిపోయింది. లేకుంటే ఈ బాదరబందీ తనకెందుకు? తను పని చేస్తున్న కాలేజీలోనే పి.డి.గా చేస్తున్న రాజారావు తనెక్కిన బస్సులోనే కాలేజికి రావడం, పోవడం, మాటలు కలవడం, కొన్నాల్టికి ఎంతో స్నేహంగా వుంటూ, ఒకరి కష్టసుఖాలొకరు చెప్పుకోవడం వరకు రావడం, ఆ తరువాత అతను పెళ్ళి ప్రసక్తి తేవటం, తన గత జీవితమంతా వివరించి, తనకీ జన్మలో పెళ్ళి ఆలోచన లేదని ఖచ్చితంగాచెప్పినా తనే షరతులు పెట్టినా ఒప్పుకుంటానని, పిల్లలిద్దర్నీ కన్నబిడ్డలకంటె మిన్నగా చూసుకుంటానని బ్రతిమాలి తన మనసును ఆకట్టుకుని, తన మెడలో తాళి కట్టాడే గాని, నమ్మించి గొంతు కోస్తాడా?...." ఆలోచనల్తో రాజీ

తల బద్దలై పోతున్నట్లుగా వుంది. గట్టిగా కళ్ళు మూసుకుని పడు కుంది.

ఆ సాయంత్రం రాజారావు ఇంటికొస్తూనే భార్య దగ్గర కొచ్చాడు. "రాజీ! ఏమిటి నీకు అనారోగ్యం? కాలేజికి శలవుపెట్టి హాస్పిటల్ కెళ్ళావట. డాక్టర్ ఏమన్నారు!" ఆత్రంగా అడుగుతూ వచ్చి భార్యపక్కన కూర్చున్నాడు. చివాల్న లేచి కూర్చుంది రాజీ. రెండు నిముషాలాగి నిదానంగా సమాధానమిచ్చింది. "మరేంలేదు, నేను తల్లిని గాబోతున్నానని చెప్పారు." రాజారావు ముఖం సంతోషంతో వెలిగిపోయిండి.

"ఎంత గుడ్ న్యూస్ చెప్పావు డియర్! అయాం వెరీ హేపీ! నీకేం కావాలో కోరుకో రాజీ! నిముషాల్లో తెచ్చి నీ కాళ్ళదగ్గర పడేస్తాను." భార్యను దగ్గరకు తీసుకున్నాడు. "కాని ఎబార్షన్ చేయించుకున్నాను" భార్య మాట లకు అదిరిపడ్డాడు. "నన్ను జోక్ చెయ్యటంలేదు కదా, లేక నీకే మైనా మతిపోయిందా?"

"ఔను. నాకు నిజంగానే మతి పోయిందిప్పుడు. ఆడదానికి మాతృత్వం వరం లాంటిదే, కాని దాన్ని నేను కోరుకోవటం లేదు. మన పెళ్ళికి ముందే చెప్పాను మీకు. మనకు పిల్లలు పుట్టకూడదని. నాని, మున్ని మన బిడ్డలని. కాని మీరింత మోస గాళ్ళని తెలుసుకోలేకపోయాను. చెప్పేదొకటి, చేసేదొకటిగా ప్రవర్తించేవాళ్ళంటే నాకసహ్యం" రాజీ కోపంగా అంది.

"స్టాపిట్! నీ ఇష్టమొచ్చినట్లు వాగకు. ఆ పిల్లలిద్దరూ మన దగ్గ రుంటే మాత్రం, మనకు పిల్లలు కలగకూడదా? పెళ్ళికి ముందు నీవు పెట్టిన షరతులన్నిటికీ ఒప్పుకున్న మాట నిజమే! మనకు పిల్లలుంటే ఆ పిల్లల్ని ప్రేమగా చూడలేమని, నేను పిల్లలు కలగకుండా ఆప రేషన్ చేయించుకోవాలని నువ్వు అడిగినమాట నిజమే! కాని నీకు నేను నిజం దాచి, ఆపరేషన్ జరిగిందని చెప్పి నిన్ను పెళ్ళి చేసుకున్నాను. అప్పుడు నీవెక్కడ పెళ్ళికి అంగీకరించవోనని, అలా అబద్ధమాడాను. కాని, ఎంత ప్రేమగా చూసినా పరాయి పిల్లలు కన్నవాళ్ళెట్లా ఔతారు?"

"ఆపండి! ఈ భావం మీకు వున్నదని ఏ మాత్రం తెలుసు కున్నా మన పెళ్ళి జరిగేది కాదు. స్వంత బిడ్డలు లేకుండేనే మీరిట్లా మాట్లాడుతున్నారే, ఇంక పుడితే ఆ పిల్లల నీడకూడా సోకనివ్వరు. ఇప్పుడైనా మీరు వెంటనే హాస్పిటల్ కెళ్ళి పిల్లలు కలగకుండా చేసుకుంటే మంచిది. ఇంకా

పరాయి పిల్లలనే ఆలోచన మరెప్పుడూ, ఆ పిల్లలమీద కలగ కూడదు మీకు" భార్య మాటలకు చాలా కోపం వచ్చింది రాజా రావుకు.

"ఏం బెదిరిస్తున్నావా? నన్ను వుద్ధరించటానికే పెళ్ళాడినట్లు మాట్లాడుతున్నావే! ఇంత దూరం వచ్చింది గాబట్టి చెబుతున్నాను— మన రక్తం పంచుకు పుట్టిన బిడ్డలు ఇద్దరు ముగ్గురుకలిగేవరకు నేను హాస్పిటల్ ముఖం చూడను. వాళ్ళేదో నిన్ను వుద్ధరిస్తారనుకుం టున్నావు కాబోలు. ఎంత ప్రేమగా చూసినా పరాయి పిల్లలు పరాయి పిల్లలే, ఎప్పటికీ మన రక్తం పంచుకుపుట్టిన వాళ్ళవలేరు. నీ కిప్పుడే తెలిసిరాదు, వయసు ఓపిక వుడిగిపోయాక కడుపున పుట్టిన వాళ్ళు. కట్టుకున్న వాడులేక, నా అనే దిక్కులేక అప్పుడు అఘో రిస్తావు. కాని, అప్పుడు చేతిలో ఏం వుండదు. చావకుండా బ్రతి కుంటే ఎప్పటికైనా నేనూ చూస్తాను-ఈ పిల్లలు నిన్నెంత వుద్ధరిస్తారో. వాళ్ళకో దారి ఏర్పడ్డాక, నీ అవసరం తీరి పోయాక, నిన్నో కుక్కలా వీధి లోకి తరిమేసి, నిన్ను అధోగతి పాలు చెయ్యకిపోతే నా పీక తెగ్గోయించుకుంటాను. ఇంక ప్రస్తుతం జరగాల్సింది ఆ పిల్ల ల్నిద్దర్నీ ఈ సంవత్సరమే అనాధ శరణాలయంలో చేర్చేయాలి. అడ్డ మైన వాళ్ళందర్నీ నా కొంపలో వుంచుకోడానికి ఇదేం ధర్మసత్రం గాదు."

"ఓహో! చాలా నిర్ణయించు కున్నారన్న మాట. ఐతే నా నిర్ణయం కూడా వినండి. నా మూలంగానే అ పసివాళ్ళిద్దరూ తల్లి దండ్రుల్ని పోగొట్టుకున్నారు. అసలు నేను బ్రతికుండటానికి మూలం వాళ్ళే. నా కంఠంలో ప్రాణమున్నంతవరకు వాళ్ళని అనా ధల్ని చెయ్యలేను. ఎవరిగురించీ, ఏ పరిస్థితుల్లోను వాళ్ళని దూరం చేసుకోలేను. ఏ శక్తీ వాళ్ళను నా నుండి దూరం చెయ్యలేదు."

"అంటే నీకు కట్టుకున్న వాడి కంటే ఆ పిల్లలే ఎక్కువన్న మాట. ఇంత జగమొండివనుకో లేదు. వాళ్ళని నీవే కన్నట్లు మాట్లాడుతున్నావే—కొంపదీసి ఆ రాజుగాడికి నీవే కన్నావేమో ఈ పిల్లల్ని!"

"ఐసే షటప్ అండ్ గెటౌట్ బ్లడీ ఫూల్! ఏం కూశావ్‌రా స్కౌండ్రల్! ఇంత కుళ్ళు కల్మషం నీలో వుంచుకునే, ఇంత

కాలం నాతో కాపురం చేశావన్న మాట. మానవ జన్మ ఎత్తిన పశువ్వి నువ్వు. నీ మనసు ఇంతగా కుళ్ళి కంపు కొడుతుం దనుకోలేదు. నీనీడ సోకితేనే నాకు మహా పాపం చుట్టుకుంటుంది. ఇదిగో నువు కట్టిన తాళి. నీ దిక్కున్న చోటికి పోయిచెప్పుకో"

అపర కాళికావతారంలో వున్న రాజీ, ఆగ్రహావేశంతో వుడికి పోతూ మెడలో తాళి చటుక్కున తెంపి, రాజారావు ముఖాన్న కొట్టింది.

అలా విడిపోయిన భార్యా భర్తలు కోర్టుద్వారా విడాకులు తీసుకుని ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు. పిల్లల్ని పెంచి ప్రయోజకుల్ని చేయాలన్న సంకల్పంతో వున్న రాజేశ్వరి, మరోవూరికి ట్రాన్స్ఫరు చేయించుకుంది. తన జీవితంలో మరెవ్వరికీ చోటివ్వ లేదు.

తననెవరో పట్టి కుదువుతూండటంతో, గతంనుండి వాస్తవంలో కొచ్చి పడింది రాజేశ్వరి. పైన సీలింగు ఫేను ఫుల్ స్పీడులో తిరుగుతున్నా, మనిషికి నిలువెల్లా చెమట్లు పట్టేసి తడిసిపోయింది. ఎదురుగా, కంగారుగా తననే చూస్తున్న నానీని చూడగానే తనను తాను కంట్రోల్ చేసుకుని, సర్దుకుని కూర్చుంది. కర్చీఫ్ తీసి ముఖమంతా తుడవసాగాడతను.

"ఏం జరిగింది ఆంటీ? ఎందు కలాగై పోయావు? ఆ ముసలాయన ఎవరు? ఎందుకలా హఠాత్తుగా లేచి వెళ్ళిపోయాడు?"

"అబ్బే! ఏం జరగలేదుబాబూ! ఆ ముసలాయన ఎవరా—మన బాబుగాడి ప్రైవేటు మాస్టారు! పెద్దతనం కదా ఏదో గుర్తుకొచ్చి వెంటనే లేచివెళ్ళిపోయాడు. నాకు ఏదో కొంచెం నీరసంగా వుండి కళ్ళు తిరిగినట్లనిపిస్తేనూ...."

"నీరసంగా వుండదా? మందు లేవీ సరిగ్గా వాడవు. పదలోపలకు. బి.పి. చూస్తాను. నిన్ను ఒక్కత్తినీ కూర్చుని ఆలోచించొద్దని ఎన్ని సార్లు చెప్పాను ఆంటీ! నీకేదన్నా నీరసం చేస్తే మున్నీకి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వుంటుంది నేను. అక్కడ్నుండి నిన్ను తన దగ్గరకు తీసుకెళ్ళిపోతానంటూ మొండిపట్టు పట్టుక్కూర్చుంటుంది ఆవిడగారు. ఐనా బావుంటేనేగాని, లేకపోతే మేమేమైపోవాలి ఆంటీ?" తన చెయ్యి పట్టి పదిలంగా నడిపించుకుని తీసుకెళ్తున్న నాని చేతిని గట్టిగా పట్టుకుని, విశ్రాంతిగా, తృప్తిగా నిట్టూర్చింది రాజేశ్వరి. ✱